సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 10 । అక్టోబర్ । 2024



వసతి గృహాల నిర్వహణపై అసంతృప్తి

రాయచోటిలోని బాలురు, బాలికల వసతి గృహాల నిర్వహణలో మౌలిక వసతుల కల్పనపై రాయచోటి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జీసీ ఆసిఫా సుల్తానా అసంతృప్తి వ్యక్తం చేశారు. -10లో



సౌమ్యనాథుని దర్శించుకున్న న్యాయమూర్తులు

నందలూరులోని శ్రీ సౌమ్యనాథస్వామిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు లక్ష్మణ్, లక్ష్మీనారాయణలు దర్శించుకున్నారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.800	రూ.880
రెండోరకం	రూ.600	రూ.780

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 98 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	470	594
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 367.500 కిలోలు

న్యూస్‌రీల్

వైన్ షాపులకు దరఖాస్తు గడువు పెంపు

రాయచోటి టౌన్: అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా వైన్ షాపులకు గడువు ఈ నెల 11వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి జి. మధుసూదన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ గడువు 11వ తేదీ రాత్రి 7 గంటల వరకు పెంచినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అలాగే లక్కీ డ్రా ఈనెల 11తేదీ బదులుగా ఈ నెల 14వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. లక్కీ డ్రా తీసే ప్రదేశం లయ గార్డెన్స్ నుంచి అజయ్ కన్వెన్షన్‌కు మార్చామన్నారు. ఈవిషయాన్ని అందరూ గుర్తించాలని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో బోనం

కలికిరి: మండల పరిధిలోని మేడికుర్తి బాహుదా నది ఒడ్డున వెలసిన ఆరిగంగమ్మకు బుధవారం మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ చేశారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మేడికుర్తి గ్రామంతో పాటు మర్రికుంటపల్లి, పారపట్ల, పత్తేగడ గ్రామం కొటాల, మొర్రంకిందపల్లి, వాల్మీకిపురం మండలం మాధవరంపల్లి తదితర ప్రాంతాల నుంచి మహిళలు బోనాలు తీసుకువచ్చి అమ్మవారికి చీర, సారెలతో సమర్పించారు.

'బతుకమ్మ' వేడుకలు



బతుకమ్మ వేడుకలో మంత్రి సతీమణి పద్మిని రాజనరసింహ

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం భువనేశ్వరి నగర్‌లో వెలసిన భువనేశ్వరి ఆలయంలో బుధవారం సాయంత్రం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు తెలంగాణా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సతీమణి పద్మిని రాజ నరసింహ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక మహిళలతో కలిసి గోగు పూలు, తంగేడి పూలు, చామంతిపూలతో పాటు పలు రకాల పూలతో పూలసింగడిని అందంగా ముస్తాబు చేశారు. ఆలయ ఆవరణంలో బతుకమ్మకు పూజలు చేశారు. స్థానిక మహిళలతో కలిసి ఆడిపాడారు. ఆమె మాట్లాడుతూ తెలంగాణా సంస్కృతిలో బతుకమ్మ పండుగ భాగమన్నారు.

హైడ్రోపవర్ ప్రాజెక్ట్ భూముల పరిశీలన

కొండాపురం: మండల పరిధిలోని కె.బొమ్మేపల్లె రెవెన్యూ పొలంలో హైడ్రోపవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు సంబంధించిన భూములను జాయింట్ కలెక్టర్ అతిథిసింగ్ పరిశీలించారు. బుధవారం జమ్మలమడుగు ఆర్డీఓ అతిములం సాయిశ్రీతో కలిసి కె.బొమ్మేపల్లె రెవెన్యూ పొలంలోని భూములను పరిశీలించారు. అదానీ గ్రూపు సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే 1000 మెగావాట్ల హైడ్రోపవర్ ప్రాజెక్టు కోసం ఎంత భూమి అవసరం, సేకరణ తదితరాలపై పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండాపురం ఇన్‌చార్జి తహసీల్దార్ మీనా, ఆర్‌ఐ మహేశ్వర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



- ఎనలేని కృషి ఫలితంగానే జిల్లాకు ఆయన నామధేయం
- అప్పటి రోశయ్య సర్కారు గెజిట్ ఉత్తర్వులు జారీ
- వైఎస్సార్ పేరు రూపుమాపేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర
- మండిపడుతున్న జిల్లా వాసులు

సాక్షి ప్రతినిధి, కడప: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జనరంజక పాలన చేసి.. ప్రజల గుండెల్లో గుడి కట్టుకున్న మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. ఆయన పేరును వైఎస్సార్ జిల్లా నుంచి వేరు చేసేందుకు కూటమి ప్రభుత్వ నేతలు కుట్రలు పన్నుతున్నారు. కడప నగరం ప్రాశస్త్యం దెబ్బతింటుందంటూ కొత్త రాగం అందుకుని జిల్లా పేరు మార్చాలంటూ ముఖ్యమంత్రికి వినతిపత్రం కూడా సమర్పించడం కుతంత్రంలో భాగమేనని వైఎస్సార్ అభిమానులు పేర్కొంటున్నారు. ఒక పథకం ప్రకారమే ఆయన పేరును తొలగించేందుకు పావులు కదుపుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

14 ఏళ్ల తర్వాత..

ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రెండు తెలుగు రాష్ట్రాలపై తిరుగులేని ముద్ర వేశారు. ఆయన మరణానంతరం గౌరవార్థం ఆయన పుట్టిన జిల్లాకు వైఎస్సార్ జిల్లా అని నామకరణం చేశారు. 2010లో అప్పటి సీఎం రోశయ్య ప్రభుత్వం అన్ని వర్గాల అభిప్రాయాలతో ఈ మేరకు గెజిట్ జారీ చేశారు. ఆనాటి నుంచి వైఎస్సార్ జిల్లాగా కొనసాగుతోంది. కొత్తగా కొలువు దీరిన కూటమి ప్రభుత్వం 14 ఏళ్ల తర్వాత ఆయన పేరును మార్చేందుకు కుట్రలకు తెరలేపింది. జిల్లా పేరును వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు మార్చారంటూ సాక్షాత్తు మంత్రి స్థానంలో ఉన్న సత్యకుమార్ ముఖ్యమంత్రికి లేఖ రాశారు. కళ్ల ముందు జీవోలు, గెజిట్లు కనిపిస్తున్నా అబద్ధాలను వల్లె వేస్తూ, కడప ప్రాశస్త్యం పేరుతో ఈ కుట్రకు తెరలేపారు.

రాయలసీమకు అభినవ కాటన్‌దొర



ఎంతో మంది సీఎంలు రాయలసీమ నుంచి వచ్చినా... ప్రాంత అభివృద్ధికి బాటలు వేసింది మాత్రం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. చంద్రబాబు రాయలసీమ వ్యక్తే.. అయినా ఆయన సీమకు చేసిందేమీ లేదు. రాయలసీమకు జీఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ పథకాలను ఆనాటి సీఎం ఎన్‌టీ రామారావు రూపకల్పన చేస్తే, ఆ పథకాలను కార్యరూపంలోకి తెచ్చింది డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. రాయలసీమలో కృష్ణాజలాలు పారుతున్నాయంటే అదీ ఆయన చలువే. ఒక్కమాటలో చెప్పాలంటే సీమకు ఆయన అభినవ కాటన్‌దొరగా వర్ణించాలని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. అందుకే వైఎస్సార్ పేరు ఈ జిల్లాకు ఉండటం సముచితమని, మార్చాలనే ప్రయత్నం చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని వైఎస్సార్ అభిమానులు పేర్కొంటున్నారు.

రాజన్న పేరు కనుమరుగు చేయాలనే..

ఎలాగైనా వైఎస్సార్ పేరును కనుమరుగు చేయాలనే తలంపుతో కూటమి నేతలు చేస్తున్న ప్రయత్నాలు జిల్లా వాసులను విస్మయానికి గురి చేస్తున్నాయి. 2010లో పేరు మార్చేటప్పుడు అభిప్రాయ సేకరణ చేపట్టారు. మెజార్టీ అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకున్న తర్వాతే జిల్లా పేరును మారుస్తున్నట్లు గెజిట్ చేశారు. దాన్ని తీసుకొచ్చి గత ప్రభుత్వంలో జిల్లాల విభజనలో కొత్తగా వైఎస్సార్ జిల్లా పేరు మార్చినట్లు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ఇదంతా చంద్రబాబు స్కెచ్‌లో భాగంగానే కడప ప్రాశస్త్యం, దేవుని కడప దేవాలయం అంటూ మతాన్ని ముందుకు తెచ్చి.. బీజేపీ వారితో ఇలాంటి ప్రతిపాదనలు చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రాశస్త్యానికి ఎలాంటి లోటు లేదు..

వాస్తవానికి కడప నగరం పేరు అలానే ఉంది. ఆ నగరం ప్రాశస్త్యం ఏ మాత్రం తగ్గలేదు. కడపలోని దేవునికడప చరిత్రతోపాటు, పెదదర్గా భిన్నత్వంలో ఏకత్వంగా మతసామరస్యానికి ప్రతీకగా ఉన్న ప్రాశస్త్యమూ తగ్గలేదు. జిల్లా పేరును, నగరం పేరుకు ముడిపెడుతూ కూటమి ప్రభుత్వం.. ముఖ్యంగా బీజేపీ నేతలు మతాన్ని అడ్డుపెట్టుకుని కొత్త డిమాండ్ తెరమీదకు తెచ్చారు. మంత్రి సత్యకుమార్ ఏకంగా సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తే... మరో బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేరు మార్చేందుకు పోరాటం చేస్తామంటూ మాట్లాడుతున్నారు. ఎక్కడో ధర్మవరం ఎమ్మెల్యేగా ఉన్న సత్యకుమార్‌కు వైఎస్సార్ జిల్లా గురించి ఏం పని అని ఇక్కడి నేతలు ప్రశ్నిస్తున్నారు. మరో వైపు 2010లో వైఎస్సార్ పేరును జిల్లాకు పెట్టేటప్పుడు ఆదినారాయణరెడ్డి కూడా ఆ నిర్ణయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా భాగస్వామ్యుడు. ఆయన సోదరుడు ఎమ్మెల్సీ హోదాలో నారాయణరెడ్డి కూడా వైఎస్సార్ పేరు పెట్టాలని ఆనాడు డిమాండ్ చేశారు. ఇప్పుడు మాట మార్చి వైఎస్సార్ పేరు మార్చాలంటూ రెండు నాల్కల ధోరణికి పరాకాష్టగా వ్యవహరిస్తున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

జిల్లాకే గర్వకారణం



కడప జిల్లా ఖ్యాతిని పెంచిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును జిల్లాకు పెట్టడంపై జిల్లా వాసులందరూ సమ్మతించారు. ఎంతో గర్వంగా భావించారు. కానీ నేడు జిల్లాకు ఆ పేరును రాజకీయ కోసం తీసేయాలని భావించడం దారుణం. వైఎస్సార్‌పై వ్యక్తిగత కక్ష కూటమి నేతలకు ఉంటే వేరేలా తీర్చుకోవచ్చు గానీ, ఇలా జిల్లా వాసులను అవమాన పరిచేలా చేయడం మంచిది కాదు.

– రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు

రాజన్న సేవలు ప్రజల గుండెల్లో..



ప్రజలకు గుర్తుండిపోయేలా జిల్లా అభివృద్ధిని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చేసి చూపించారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేశారు. సాగునీటి ప్రాజెక్టులు, రిమ్స్, నూతన కలెక్టర్ కార్యాలయ భవనాలు, యోగివేమన యూనివర్సిటీ తదితరాలు నిర్మించారు. జిల్లాకు దశదిశలా గుర్తింపు తెచ్చారు. ఆయన పేరు తొలగించే చర్యలకు కూటమి ప్రభుత్వం దిగి ప్రజల్లో అభాసుపాలు కావద్దని చెబుతున్నాను.


– రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కడప రీజినల్ ఆర్టీసీ మాజీ అధ్యక్షుడు

చిరస్మరణీయుడు



ఉభయ తెలుగు రాష్ట్రాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని అభిమానించని వారు ఉండరు. ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నో వినూత్న పథకాలను తెలుగు ప్రజలకు అందించిన చిరస్మరణీయుడు. అటువంటి వ్యక్తికి జన్మనిచ్చిన ఈ గడ్డకు వైఎస్సార్ జిల్లాగా పేరు పెట్టడం ఎంతైనా సమంజసం. ఆయన సేవలు భావి తరాలు మననం చేసుకోవటానికి మాత్రమే గానీ రాజకీయ కోణం చూడరాదు.

– నాగమునిరెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ ఈఓ, కడప



పాపాఘ్నికి నీటి విడుదల

వీరపునాయునిపల్లె: మండలంలోని పాపాఘ్ని నదికి జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యకుమార్‌రెడ్డి బుధవారం కృష్ణా జలాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాలేరు నగరి సుజల స్రవంతి ప్రధాన కాలువ నుంచి అడవిచెర్లోపల్లె వద్ద వాగులోకి వదలడం జరిగిందన్నారు. ఈ నీరు బుసిరెడ్డిపల్లె, పోచంరెడ్డిపల్లె, వీరపునాయునిపల్లె, అనిమెల మీదుగా పాపాఘ్ననదిలోకి చేరుతుందని తెలియజేశారు. వాగు ద్వారా నీటిని విడుదల చేయడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని, దీంతో రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

మైలవరం నుంచి పెన్నాకు..

జమ్మలమడుగు: మైలవరం జలాశయం నుంచి పెన్నా నదిలోకి నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ రమేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైలవరం జలాశయం ఒక గేటు ద్వారా మొదట 1200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. క్రమేణ 2500 క్యూసెక్కులకు పెంచడం జరుగుతుందన్నారు. కావున పెన్నా పరీవాహక ప్రాంతాల ప్రజలు నదిలోకి వెళ్లకుండా ఉండాలని సూచించారు. అలాగే అప్రమత్తంగా ఉండాలని వివరించారు.

పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలి



జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు

కడప కార్పొరేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు అభిప్రాయపడ్డారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అధికార టీడీపీ నాయకుల వ్యవహరిస్తున్న తీరుపై చర్చించారు. ప్రలోభాలకు గురిచేసి, భయపెట్టి, బెదిరించి తమ పార్టీ నేతలను టీడీపీలో చేర్చుకుంటున్న వైనాన్ని ఎండగట్టారు. వీటిని సమష్టిగా ఎదుర్కోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, మేయర్ కె.సురేష్‌బాబు, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, డీసీ గోవిందరెడ్డి, ఎంపీ రామచంద్రారెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, డాక్టర్ సుధీర్‌రెడ్డితదితరులు పాల్గొన్నారు.

వీణాపాణి.. విద్యా ప్రదాయిని

శరన్నవరాత్రి మహోత్సవాలు అంబరాన్ని అంటగా.. భక్తులు దేవీ అలంకరణ వైభవాన్ని తిలకించి తరిస్తున్నారు. ఏడో రోజైన బుధవారం జగజ్జననికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు ఒక్కో ప్రాంతంలో ఒక్కో రూపంలో దర్శనమిచ్చి అభయమిచ్చారు. రెండో మైసూరుగా పేరుగాంచిన ప్రొద్దుటూరులో దసరా ఉత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిశాలలోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి సరస్వతీదేవిగా కటాక్షించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని కనులారా దర్శించుకున్నారు. 'జయహో జగన్మాత' అని కీర్తించారు. 'వీణాపాణి.. విద్యా ప్రదాయిని' తమలో జ్ఞాన జ్యోతులు వెలిగించాలని వేడుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో భక్తుల సందడి



సరస్వతిదేవిగా వాసవి మాత

విద్యార్థి భవితవ్యానికి అపార్

- అన్నింటికీ అదే నంబర్
- జారీకి అధికారుల కసరత్తు
- వివరాల సేకరణలో నిమగ్నం

మదనపల్లె సిటీ: అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ). దేశంలో ప్రతి విద్యార్థికి అందించే గుర్తింపు నంబరు. జాతీయస్థాయిలో ప్రతి విద్యార్థికి ఒక్కో నంబరు కేటాయించి, తదనుగుణంగా వారి సర్వ సమాచారాన్ని నిక్షిప్తం చేస్తారు. 'వన్ నేషన్, వన స్టూడెంట్' నినాదంలో భాగంగా కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ కొత్త అధ్యయనానికి శ్రీకారం చుట్టింది. జాతీయ నూతన విద్యా విధానం–2020 అమలులో భాగంగా ఈ దిశగా అడుగేసింది. కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులకు కేటాయించనుండగా. ఈ నెల 25వ తేదీ నుంచి కార్యక్రమం మొదలవనుంది. ఈ మేరకు జిల్లాలో విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అవగాహన కల్పించారు.

పొందే విధానం: పాఠశాలకు విద్యార్థితో పాటు తల్లి లేదా తండ్రి కచ్చితంగా వెళ్లాల్సిందే. తొలుత యూడైస్‌లో నమోదైన వివరాలు సరి చూసుకోవాలి. అనంతరం ఆన్‌లైన్‌లో అపార్ కార్డుకు దరఖాస్తు చేయాలి. హెచ్ఎం ధ్రువీకరణ అవసరం. ఆయన అంగీకారంతో యూడైస్ వెబ్‌సైట్ వేదికగా ప్రక్రియ చేపడతారు. విద్యార్థి ఆధార్ అనుసంధానమైన సెల్‌ఫోన్ నంబరుకు ఓటీపీ వస్తుంది. అనంతరం గుర్తింపు నంబరు జారీ అవుతుంది. ఆన్‌లైన్‌లో కార్డు ఒకసారి వెలువడితే సవరణకు అవకాశం ఉండబోదు.

గుర్తింపు కార్డు ప్రత్యేకతలు: విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, జెండర్, ఫోటో, క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు నంబరు డిజిటల్ కార్డులో ఉంటాయి.



తరగతి గదిలో విద్యార్థులు (ఫైల్)



కేంద్రం జారీ చేయనున్న అపార్ కార్డు నమూనా

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు	1,735
ప్రాథమికోన్నత పాఠశాలలు	162
ఉన్నత పాఠశాలలు	304
మొత్తం విద్యార్థులు	1,42,238
జూనియర్ కాలేజీలు	136
మొదటి సంవత్సరం విద్యార్థులు	14,830
రెండో సంవత్సరం విద్యార్థులు	15,496


అకాడమీ సమాచారం, విద్యార్థి విజయాలు ఎప్పటికప్పుడు నమోదవుతాయి. అకాడమీ పరంగా జీవితకాల గుర్తింపు కార్డుగా పరిగణిస్తారు. విద్యార్థి సంబంధిత సర్వ సమాచారం సమీకృతంగా ఒకే చోట లభిస్తుంది. ఆన్‌లైన్‌లో నంబరు నమోదు లేదా క్యూ కోర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సమాచారం తెలుసుకోవచ్చు. అన్ని రకాల యాజమాన్యాల విద్యార్థులకు ఇది అవశ్యం.

నిర్వాహకుల బాధ్యత..

అపార్ ప్రాధాన్యంపై తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సి ఉంది. యూడైస్ వెబ్‌సైట్‌లో విద్యార్థికి పెన్ (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబరు) ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఆధార్ చెల్లుబాటు (వ్యాలిడేట్) అయి ఉండేలా ప్రేరణ కల్పించాలి.

ప్రయోజనాలు: గుర్తింపు కార్డు, విద్యార్థి బ్యాంకు ఖాతా (అకాడమీ), డీజీ లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది. క్రెడిట్స్ (మార్కులు)ను బదలాయించవచ్చు. వివిధ విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రవేశపరీక్షల్లో వివరాలు నమోదు, ధ్రువీకరణ సులువుగా పూర్తవుతుంది. ఉపకార వేతనాలు, ఉద్యోగాలు భర్తీ సమయం, ఇతర సందర్భాల్లో కీలకం కానుంది. ఈ సమాచారం ప్రామాణికంగా భావించనున్నారు.

ఎంతో ఉపయోగం:



ప్రతి విద్యార్థికి కేంద్ర ప్రభుత్వం 'అపార్' గుర్తింపు నంబరును జారీ చేస్తుంది. భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరం. విద్యార్థుల తల్లిదండ్రులు చొరవ చూపాలి. పాఠశాల హెచ్ఎంలను సంప్రదించాలి. త్వరలో కేటాయింపు ప్రక్రియ మొదలవుతుంది.

–శ్రీరాం పురుషోత్తం, డీవైఈఓ, మదనపల్లె



క్లుప్తంగా

ఇరువర్గాల ఘర్షణ

వీరబల్లి : మండలంలోని గుర్రప్పగారిపల్లి పంచాయతీలోని కొత్తవడ్డిపల్లిలో ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు.మంచినీటి పైపులైన్ గేట్ వాల్ మార్పే విషయంపై రాయచోటి విశ్వనాథ్ అనే వ్యక్తితో అదే గ్రామానికి చెందిన ఆంజనేయులు, రామయ్య, వెంకటలక్ష్మీ ఘర్షణ పడ్డారు. దీంతో విశ్వనాథ్‌కు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఆటో

– ఒకరికి తీవ్ర గాయాలు

గాలివీడు : రాయచోటి నుంచి కదిరికి వెళుతున్న ఆర్టీసీ బస్సును తూముకుంట నుంచి గాలివీడు వస్తున్న ఫోర్ వీలర్ ఆటో వెలిగల్లు ప్రాజెక్టు సమీపంలో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనలో గాయపడిన వ్యక్తిని వైద్య సేవల నిమిత్తం 108 వాహనం ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు గాలివీడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

రామసముద్రం : రామసముద్రం మండలం ఎగువపల్లెకు చెందిన వెంకటలక్షుమ్మ(70) రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. బహిర్భూమికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. స్థానికులు వెంటనే మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు సిఫార్సు చేశారు. అప్పటికే ఆలస్యం కావడంతో ఆమె మృతి చెందింది.

కిలో గంజాయి స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు

పుల్లంపేట : పుల్లంపేట మండలంలోని అప్పారాజుపేట వద్ద బుధవారం గంజాయి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మనోజ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వేలం పాడారు.. వెంటనే వదిలేశారు!

- రూ.45.20 లక్షలకు పాటపాడి.. ఇప్పుడు వద్దంటున్న వైనం
- ప్రొసీడింగ్స్ ఇవ్వకనే టోల్‌ఫీజు టోకెన్లు ముద్రణ
- రెవెన్యూ అభ్యంతరంతో వెనక్కు తగ్గారు



హార్సిలీహిల్స్ వద్ద టోల్ వసూలుకు వేసిన రేకుల షెడ్డు

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు వచ్చే సందర్శకుల నుంచి టోల్ రుసుము వసూలుకు గతనెల 30న వేలంపాటలు నిర్వహించగా అత్యధిక వేలం పాడిన వ్యక్తి ఇప్పుడు తనకు టోల్ లీజు వద్దంటూ వెనక్కు తగ్గినట్టు తెలిసింది. వేలం పూర్తి చేసిన ఒకట్రెండు రోజుల్లోనే పాటలో 50 శాతాన్ని ముందుగా చెల్లించి రుసుము వసూలు చేసుకోవాలి. అయితే పది రోజులు గడిచినా పాటదారు ముందుకు రాకపోవడంతో ఇప్పుడు ఏం చేయాలన్న దానిపై అధికారులు ఆలోచనలో పడ్డారు. 2022లో రూ.26.85 లక్షలు పలికిన వేలంపాట, 2023లో రూ.27.35 లక్షలు పలికి, 2024కు రూ.45.20 లక్షలు పలకడంతో అందరూ ఆశ్చర్యపోయారు. 17 మంది వేలంలో పాల్గొనగా మదనపల్లెకు చెందిన వ్యక్తి అధిక ధరకు పాట దక్కించుకున్నారు. దీంతో టౌన్‌షిప్ కమిటీకి మంచి ఆదాయం వచ్చిందని అధికారులు భావించారు. అయితే పాడిన పాటకు తగ్గ ఆదాయం లేదని లెక్కలు వేసుకుని లీజు తనకు వద్దని పాటదారు వెనక్కు వెళ్లినట్టు చెబుతున్నారు.

నగదు చెల్లించకనే టోకన్లు

సాధారణంగా వేలంపాట ముగిశాక టోల్‌ఫీజు వసూలుకు సబ్‌కలెక్టర్ ప్రొసిడింగ్స్ ఇస్తారు. దీని ఆధారంగా హార్సిలీహిల్స్‌కు వచ్చే బైక్, వాహనాల నుంచి టోల్‌ఫీజు వసూలు చేసుకుంటారు. పాట దక్కించుకున్న వ్యక్తి పాటలో 50 శాతం సొమ్మును మొదట చెల్లించాలి. ఆరునెలల తర్వాత మిగతా 50 శాతం చెల్లించాలి. అయితే 50 శాతం సొమ్ము చెల్లించకనే పాటదారుడు టోకెన్లను ముద్రించుకున్నాడు. అది కూడా సబ్‌కలెక్టర్ నిర్ణయించిన రుసుము కంటే అధికంగా వసూలుకు టోకెన్లను ముద్రించుకున్నాడు. హార్సిలీహిల్స్‌కు అతి సమీపంలోని రేకుల షెడ్డును వేయించాడు. ఐదురోజుల క్రితం టోల్ వసూళ్లకు వచ్చిన రెవెన్యూ సిబ్బందిని వసూలు నుంచి తప్పుకోవాలని కోరాడు. దీనిపై వీఆర్ఏలు బి.కొత్తకోట తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా ప్రొసీడింగ్స్ తీసుకుని అప్పగించాలని సూచించారు. ఈ ప్రొసీడింగ్స్ చూపాలని కోరగా లేదని చెప్పడంతో వారికి రుసుము వసూలుకు అవకాశం ఇవ్వలేదు. దీంతో ప్రైవేటు సిబ్బంది వెనుదిరిగి వెళ్లిపోయారు.

వీఆర్ఏలతో వసూళ్లు

హార్సిలీహిల్స్ టోల్ వసూళ్ల బాధ్యతను మండలంలోని వీఆర్ఏలకు అప్పగించారు. రోజుకు ముగ్గురు వసూలు చేస్తారు. ఒక్కొక్కరు 8 గంటల పనిని విభజించి పని చేస్తున్నారు. ఈ వసూళ్ల వివరాలను రోజువారీగా అధికారులకు సమాచారం ఇస్తున్నారు. అందులోనే ఏ వీఆర్ఏ విధుల్లో ఉంటే ఆ వీఆర్ఏ వసూలు చేసిన మొత్తాన్ని గంటల వారీగా కూడా వివరాలు నివేదిస్తున్నారు.

ఊరించి ఉసూరుమనిపించి..

ఏడాదికి రూ.45.20 లక్షల టోల్‌ఫీజు వచ్చిందంటే రెవెన్యూ అధికారుల సంబరం ఎన్నో రోజులు నిలవలేదు. వచ్చే ఏడాది ఇంతకుమించిన ఆదాయం వస్తుందని కూడా అంచనా వేశారు. అయితే పాటదారుడు వెనక్కు వెళ్లడంతో ఇప్పుడు ఏం చేయాలన్న దానిపై అధికారులు పరిశీలిస్తున్నట్టు తెలిసింది. పాటలో పాల్గొన్న వారిలో ఒకరు రూ.33 లక్షలు, మరొకరు రూ.40లక్షలకు పైబడి పాటపాడారు. వీరిలో ఎవరు ముందుకు వస్తే వారికి టోల్ అప్పగిస్తారా లేక మళ్లీ వేలంపాటలు నిర్వహిస్తారా అన్నది అధికారులే నిర్ణయించాలి.

రహదారి మధ్యలో గుంత.. పాత ఫ్రిజ్‌తో తీరిన చింత



నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) వారి నేతృత్వంలో నిర్వహిస్తున్న కడప–రేణిగుంట జాతీయ రహదారి ఇటీవల అధ్వానంగా తయారైంది. రాజంపేట మండలంలోని బోయనపల్లె వద్ద హైవే మధ్యలో గుంత పడింది. అది కొన్నాళ్లుగా ఉంది. వాహనదారులు ప్రమాదాల బారిన పడతారనే ఉద్దేశంతో స్థానికులు పాడుబడిన ఫ్రిజ్‌ను తీసుకొచ్చి ఇందులో పెట్టారు. అలాగైనా గమనించి పక్కకు వెళతారని వారు ఈ ఉపాయం పన్నారు. ఇటీవల ఈ రహదారి గుంతలమయమైనా ఎన్‌హెచ్ఏఐ వారు పట్టించుకోవడం లేదు. – రాజంపేట

ఉచిత కంటి పరీక్షలకు మంగళం

మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి టౌన్ : ప్రభుత్వ ఆస్పత్రులలో పేద ప్రజలకు నిర్వహించాల్సిన ఉచిత కంటి పరీక్షలతో పాటు ఉచిత కళ్ల అద్దాల పంపిణీ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం మంగళం పాడిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో వృద్ధులు కంటి చూపు మందగించి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత్యంతరం లేక ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఉచిత కంటి పరీక్షల పథకానికి సంబంధించి ప్రైవేట్ వైద్య కంపెనీలతో గడువు ముగిసినా వెంటనే రెన్యువల్ చేయాల్సిన కూటమి ప్రభుత్వం చొరవ చూపకపోవడం దారుణమన్నారు. ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా పథకాల పరిస్థితి కూడా ఇలాగే ఉందన్నారు.

వసతి గృహాల్లో మౌలిక వసతులపై అసంతృప్తి



హాస్టల్ వార్డెన్‌తో చర్చిస్తున్న న్యాయమూర్తి జీసీ ఆసిఫా సుల్తానా

రాయచోటి టౌన్ : రాయచోటిలోని బాలురు, బాలికల వసతి గృహాల నిర్వహణలో మౌలిక వసతుల కల్పనపై రాయచోటి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జీసీ ఆసిఫా సుల్తానా అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం రాయచోటి పట్టణంలోని సాయి థియేటర్ ఎదురు వీధిలోని హాస్టల్, అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ వీధిలో హాస్టల్, ఎస్ఎన్ కాలనీలో ఉన్న మరో హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె హాస్టళ్లలో తాగునీటి సమస్యను ప్రధానంగా గుర్తించారు. అలాగే గదులకు కిటికీలు లేకపోవడం, గదులలో ఫ్లోరింగ్ కొట్టుకుపోవడం, ప్రహరీ లేకపోవడం వలన చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆమె గుర్తించారు. ఈ విషయాలను పూర్తిగా నమోదు చేసుకొని సంబంధిత అధికారులకు తెలియజేసి త్వరగా పరిష్కారమయ్యేలా చూస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది విజయ్, కానిస్టేబుల్ ప్రవీణ్‌కుమార్, మురళి, హాస్టల్ వార్డెన్‌లు శ్రీనివాసులు, లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులు స్వాధీనం

మదనపల్లె : అక్రమంగా నిల్వ ఉంచిన రూ.2.25 లక్షల విలువగల టపాసులను స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ సీఐ చాంద్ బాషా తెలిపారు. వన్ టౌన్ పరిధిలోని నీరుగట్టువారిపల్లె, కాట్లాటపల్లె రోడ్డులోని ఇళ్ల మధ్య స్థానికుడైన మనోహర్ అక్రమంగా టపాసులు నిల్వ ఉంచారని స్థానికుల వద్ద నుంచి సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. తనిఖీ చేయగా నిల్వ ఉంచిన టపాసులకు ఎలాంటి అనుమతులు లేవని గుర్తించామన్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి, 41 నోటీస్ ఇస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ దాడిలో ఎస్ఐ అంషాలు బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్

సిద్ధవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో బుధవారం బెటాలియన్ పోలీసు కుటుంబాల సమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించామని బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంటు నాగేశ్వరప్ప తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అమర వీరుల త్యాగాలు మరువలేమని, వారి కుటుంబాల సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఆర్.విల్సన్, ఎన్‌డీ ప్రసాద్, మహిళా వైద్యాధికారి దివ్యరాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణహానిపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు

మదనపల్లె : భూవివాదంలో తమ గ్రామానికి చెందిన వ్యక్తుల నుంచి ప్రాణహాని ఉందని, తక్షణం సబ్ కలెక్టర్ స్పందించి తనకు న్యాయం చేయాల్సిందిగా మదనపల్లె మండలం వేంపల్లె పంచాయతీ బండకాడపల్లెలో నివాసం ఉంటున్న శ్రీనివాసులు బుధవారం సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ...తమ గ్రామానికి చెందిన నిషాంత్, చంద్రశేఖర్‌లతో ఐదేళ్లుగా ఇళ్లు, భూములకు సంబంధించి వివాదం నడుస్తోందన్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో తనపై మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్‌లో నిషాంత్ దురుద్దేశపూర్వకంగా ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయించాడన్నారు. అధికారులను బెదిరిస్తూ, రెవెన్యూ రికార్డుల పరంగా సర్వహక్కులు కలిగిన భూముల విషయంలో ఆధిపత్యం ప్రదర్శిస్తూ తనను, కుటుంబ సభ్యులను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలిపాడు. దీనిపై ఇప్పటికే పలుమార్లు జిల్లా కలెక్టర్, ఎస్పీ, సబ్ కలెక్టర్, డీఎస్పీలకు వినతులు సమర్పించానన్నారు. అయినప్పటికీ తనకు న్యాయం జరగలేదన్నారు. ఉన్నతాధికారులు తన విషయంలో స్పందించి న్యాయం చేయాల్సిందిగా వేడుకున్నాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వరుణ్‌కుమార్

గాలివీడు : మండల పరిధిలోని గోరాన్‌చెరువు వడిసెలవంక పల్లె వద్ద బుధవారం ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో దిగువగొట్టివీడు గ్రామం జంగం పల్లెకు చెందిన వరుణ్ కుమార్ (24) మృతి చెందాడు. దిగువగొట్టివీడు నుంచి గాలివీడుకు ద్విచక్ర వాహనంలో వస్తున్న వరుణ్ కుమార్ వడిసెల వంక నుంచి గాలివీడుకు వస్తున్న ట్రాక్టర్ పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో యువకుడి తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ట్రాక్టర్‌ను గాలివీడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుటుంబ సమస్యలతో ఆత్మహత్య

మృతుడు రాచవేటివారిపల్లె పంచాయతీ వార్డు మెంబర్



ఆదినారాయణ (ఫైల్)

మదనపల్లె : ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యల కారణంగా మనస్థాపం చెంది ఆటో డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. వాల్మీకిపురం మండలం కూరపర్తికి చెందిన లక్ష్మన్న కుమారుడు ఆదినారాయణ(52), నిమ్మనపల్లి మండలం రాచవేటివారిపల్లె పంచాయతీ గుడ్లవారిపల్లెకు చెందిన సరస్వతిని పెళ్లి చేసుకుని చాలా సంవత్సరాల క్రితమే గుడ్లవారిపల్లెలో స్థిరపడ్డాడు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడిగా రాచవేటివారిపల్లె పంచాయతీ 11వ వార్డు సభ్యుడుగా కొనసాగుతున్నాడు. స్వయంగా ఆటో సమకూర్చుకుని ప్రతిరోజు మదనపల్లెలో బాడుగకు నడుపుతూ జీవిస్తున్నాడు. భార్య సరస్వతి పాడి ఆవులను పెంచుతూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటోంది. వీరికి వెన్నెల ప్రియ, విష్ణు ప్రియ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరికీ వివాహాలు కాగా వారు ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. ఏడాదిన్నర క్రితం చిన్న కుమార్తెకు వివాహం చేసేందుకు కొంతమేర అప్పులు చేశాడు. ఇటీవల కొద్ది రోజులుగా కుటుంబంలో చిన్నపాటి సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో ఆదినారాయణ మద్యానికి బానిస అయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం యథావిధిగా బాడుగకు నడిపేందుకు ఇంటి వద్ద నుంచి మదనపల్లెకు వచ్చాడు. అయితే తిరిగి రాత్రికి ఇంటికి వెళ్లలేదు. కంగారుపడిన కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం పలుచోట్ల వెతికారు. బుధవారం ఉదయం మదనపల్లె మండలం చెంబకూర్ రోడ్డు మాలేపాడు పంచాయతీ రెక్కమాను వద్ద, రోడ్డు పక్కనే ఆటో నిలిపి ఉంచి, సమీపంలోని ఓ చెట్టుకు వ్యక్తి ఉరి వేసుకుని వేలాడుతుండడాన్ని స్థానికులు గమనించారు. మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు, తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులతో పాటు తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని కిందికి దించి, ఘటనకు దారితీసిన పరిస్థితులను, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

సౌమ్యనాథుని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు



ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహిస్తున్న న్యాయమూర్తులు

నందలూరు : ఉమ్మడి కడప జిల్లాలో చరిత్రాత్మక, సుప్రసిద్ధ దేవాలయమైన నందలూరులోని శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయాన్ని బుధవారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు ఎం.లక్ష్మణ్, ఎ.లక్ష్మీనారాయణలు దర్శించుకున్నారు. ముందుగా ఆలయ పూజారులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ విశిష్టత వివరించారు. అనంతరం ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్, టీడీ ఇన్‌స్పెక్టర్ దిలీప్, కోర్టు సూపరింటెండెంట్ రమేష్, పురావస్తుశాఖ విశ్రాంత ఉద్యోగి రామాంజనేయులు, ఏఎస్ఐ శంకర్ నాయక్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పెన్నాలో నీట మునిగి యువకుడి గల్లంతు

సిద్ధవటం : మండల కేంద్రమైన సిద్ధవటంలోని పెన్నానది లోలెవల్ కాజ్‌వే వద్ద బుధవారం మధ్యాహ్నం కడప బీడీ కాలనీకి చెందిన జేమ్స్(28) నీటిలో మునిగి గల్లంతయ్యాడు. కడపకు చెందిన నలుగురు కూలి పనులు చేసుకునే వ్యక్తులు బుధవారం సిద్ధవటంలోని లోలెవల్ కాజ్ వే వద్ద పెన్నానదిలోకి వచ్చారు. ముగ్గురు బయట ఉండగా జేమ్స్ అనే యువకుడు ప్యాంట్, షర్టు, చెప్పులు ఒడ్డుపైనే వదిలేసి పెన్నా నీటిలోకి దిగాడు. నీరు లోతుగా ఉండటంతో మునిగిపోయాడని అతనితో పాటు వచ్చిన వారు తెలిపారు. సమాచారాన్ని వారు జేమ్స్ కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలిపారు. కుటుంబీకులు సిద్ధవటం పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పెన్నానది వద్దకు చేరుకుని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అప్పటికే చీకటి పడటంతో జేమ్స్ జాడ కనిపించలేదు. సీఐ కృష్ణంరాజు నాయక్ మాట్లాడుతూ ఈతగాళ్లతో పెన్నానీటిలో గాలింపు చర్యలు చేపడతామన్నారు. జేమ్స్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు.

మైసూరవారిపల్లికి ఆటస్థలం ఇచ్చిన పవన్ కల్యాణ్

సాక్షి, అమరావతి : రైల్వేకోడూరు నియోజకవర్గం మైసూరవారిపల్లి గ్రామంలోని విద్యార్థులు ఆడుకునేందుకు ఎకరం స్థలాన్ని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విరాళంగా ఇచ్చారు. సొంత ట్రస్టు నిధుల నుంచి రూ.60 లక్షలు వెచ్చించి పాఠశాలలకు ఆట స్థలాన్ని బహూకరించారు. బుధవారం రాత్రి మంగళగిరిలోని ఉపముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మైసూరవారిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలకు తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన భూమిని అన్నమయ్య జిల్లా కలెక్టర్, రాజంపేట సబ్ కలెక్టర్ సమక్షంలో గ్రామ పంచాయతీకి అందజేశారు. పవన్ కల్యాణ్ లెర్నింగ్ సెంటర్ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ నుంచి రూ. 60 లక్షలు వెచ్చించి పాఠశాలకు సమీపంలో ఎకరం స్థలాన్ని కొనుగోలు చేశారు. ఈ స్థలాన్ని మైసూరవారిపల్లి గ్రామ పంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ గతంలో తాను మైసూరవారిపల్లి గ్రామ సభకు వెళ్లిన సందర్భంలో అక్కడ పాఠశాలకు ఆట స్థలం లేదన్న విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు తన దృష్టికి తీసుకువచ్చారని, దసరా లోపు ఆట స్థలం ఏర్పాటు చేస్తామని మాటిచ్చానని ఆమేరకు స్థలాన్ని కొనుగోలు చేసి ఇచ్చినట్లు తెలిపారు. మైసూరవారిపల్లిలో మొదలుపెట్టిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా తీసుకువెళ్తామన్నారు. ప్రభుత్వ పాఠశాల ఆట స్థలం కోసం భూమి విక్రయించిన పగడాల పద్మావతిని పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యుడు పిడుగు హరిప్రసాద్, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పాల్గొన్నారు.